# సుఖీభవ

## సంతాన భారతం మనది!

**జనాభా వందకోట్లను దాటి చైనానూ మించిపోతున్న ప్రస్తుత తరుణంలో కూడా మనం 'సెక్స్'ను చెడ్డ పదంగా, అసభ్య పదంగా భావిస్తున్నట్టు 'నటిస్తుంటే'.. పెద్ద తప్పు చేస్తున్నట్టే లెక్క!**

# విజ్ఞానం వెలుగులోకి!

మానవ నాగరికత విస్తరిస్తూ.. మనిషి పురోగమిస్తున్న తొలి నాళ్లలో.. సెక్స్ పట్ల ఎటువంటి దాపరికాలూ లేని విశాల దృక్పథమే ఉండేది. ఒక్క మన దేశంలోనే కాదు.. ప్రపంచ నాగరికతలన్నింటిలోనూ ఇదే సానుకూల ధోరణి ప్రతిఫలించింది. కానీ కాల క్రమంలో.. సెక్స్.. ఓ చాటుమాటు వ్యవహారంగా.. బహిరంగంగా మాట్లాడటానికి కూడా వీల్లేని చీకటి తంతుగా మారిపోయింది. ఫలితంగా సెక్స్ చుట్టూ ఎన్నో అపోహలు అల్లుకున్నాయి. అజ్ఞానం ఆవరించింది. అరకొర అవగాహన పెద్ద అడ్డుగోడ అయ్యింది. వీటన్నింటినీ ఛేదించటానికి శాస్త్ర రంగానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. సెక్స్‌ను సశాస్త్రీయంగా అర్థం చేసుకుంటూ.. సెక్స్ సమస్యలకు సమర్థ చికిత్సలు అందుబాటులోకి తేవటంలో నేటి ఆధునిక వైద్యరంగం అనూహ్య పురోగతి సాధించింది. ఈ గమ్యం.. ఈ పురోగతి.. ఎంతో విజ్ఞానదాయకం! అపోహలు వీగిపోవటానికి ఇదెంతో అవసరం. అందుకే ఈ పురోగమనాన్ని సచిత్రంగా మీ ముందు ఆవిష్కరిస్తోంది నేటి సుఖీభవ!

## సెక్స్: అత్యవసర విజ్ఞానం!

మనం ఇపుడు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాం.

ఒకవైపు- హెచ్ఐవీ/ఎయిడ్స్ కేసుల్లో మిగతా ప్రపంచ దేశాలను దాటి పోయాం. సెక్స్ పట్ల అవగాహన అట్టడుగు స్థాయిలో ఉంది. పట్టణాల్లో అక్రమ సంబంధాలు పెరుగుతున్నాయి. యుక్తవయసు కూడా రాకముందే చాలామంది లైంగిక కార్యకలాపాలకు దిగుతున్నారు. డబ్బు దండిగా చేతికి అందుతుండటంతో చిన్నవయసులోనే ఉత్సుకత పెరుగుతోంది. టీవీలు, వెబ్ సైట్లు తేలికగా దారి తప్పిస్తున్నాయి.



డా॥ సుధాకర్ కృష్ణమూర్తి
ఆండ్రాలజిస్ట్
ఆండ్రోమెడా ఆండ్రాలజీ సెంటర్
హైదరాబాద్

మరోవైపు- 'సెక్స్ సమస్య'లూ పెరుగుతున్నాయి. జీవనశైలిలో వచ్చిన మార్పులతో మధుమేహం-హైబీపీ విస్తరించిపోతూ.. వీటి ఫలితంగా సామర్థ్య సమస్యలూ అనూహ్యంగా పెరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి, శారీరక శ్రమలేని జీవనశైలి ఎందరినో లైంగికంగా కుంగదీస్తోంది. పరిస్థితులు ఇలాగే ఉంటే మున్ముందు మన దేశం 'ప్రపంచ నపుంసక కేంద్రం'గా మారుతుందన్న హెచ్చరికల్లో అతిశయమేం లేదు. సెక్స్ పట్ల మన వైఖరిలో మార్పు రావాల్సిన, అవగాహన పెరగాల్సిన సందర్భమిది!

సరైన లైంగిక విజ్ఞానాన్ని అందించాల్సిన ఇళ్లలో, స్కూళ్లలో, సమాజంలో.. అన్నిచోట్లా సెక్స్‌ను ఒక 'నిషిద్ధ పదం'గా చూస్తుండటం వల్ల అనుమానాలు, అపోహలు రాజ్యమేలుతున్నాయి. వాస్తవానికి సెక్స్ విషయంలో ఆధునిక శాస్త్ర రంగం ఎంతో పురోగమించింది. మధ్య యుగాల నాటి చీకటి తెరల్లోంచీ, గుడ్డినమ్మకాల్లోంచీ సెక్స్‌ను బయటకు తెచ్చి.. దాన్ని సశాస్త్రీయంగా అర్థం చేసుకోవటంలో వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధించింది. ఎన్నో అపోహలు వీడిపోయాయి. ఎన్నో సెక్స్ సమస్యలకు ఇప్పుడు సమర్థమైన పరిష్కారాలు, చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ శాస్త్రీయమైన లైంగిక విజ్ఞానం అందరికీ అందటం.. ఇప్పటి కనీస అవసరం.

సమాజంలో సర్వత్రా 'సెక్స్' కార్యకలాపాలు సాగుతూనే ఉన్నాయి. కానీ ఏది సరైన సెక్స్? ఏది సురక్షిత సెక్స్? ఏది బాధ్యతాయుతమైన సెక్స్? అన్న అవగాహన మాత్రం కనీస స్థాయిలో ఉంటోంది. సెక్స్ గురించి తెలుసుకోవటంలో, అవగాహన పెంచుకోవటంలో ఎవరికీ అసౌకర్యం ఉండకూడదు. 'లైంగిక విద్య' అన్నది కేవలం ఇంట్లోనో, లేక కేవలం స్కూల్లోనో నేర్పేది కాదు. ఇది చిన్నతనం నుంచీ, అన్ని వైపుల నుంచీ అందాలి. బాధ్యతాయుతమైన లైంగిక విద్య స్కూలు కంటే ముందే.. ఇంటి దగ్గరే ఆరంభమవుతుంది. అది తప్పు ధోరణిలో సాగకూడదు. పిల్లలు జననావయవాలు ముట్టుకోవటం సహజం. వెంటనే మనం 'ఛీఛీ, చెయ్యి తీసెయ్' అనకూడదు. దీనివల్ల పిల్లలు సెక్స్ అనేది చెడ్డపని, అపరిశుభ్రమన్న తప్పుడు నమ్మకాల్లో పెరుగుతారు. క్రమేపీ బిడియం, భయాల్లో కూరుకుంటారు. చివరికి తప్పుడు మార్గాల్లో.. తప్పు సమాచారాన్నే ఒంటబట్టించుకుంటారు. సెక్స్ విజ్ఞానాన్ని ఇంట్లోనూ, స్కూల్లోనూ కూడా ఆరోగ్యకరమైన ధోరణిలో అందించటం అవసరం. సెక్స్ ఎడ్యుకేషన్ పేరుతో పిల్లలకు కేవలం సైన్స్ బొమ్మలు చూపిస్తూ.. జబ్బుల గురించి చెబుతుంటే వాళ్లకు ఆసక్తి ఉండదు. సెక్స్ అనేది వాళ్ల దృష్టిలో ఆహ్లాదకరమైన, ఆనందకరమైన అంశం. దాన్ని ఆ ధోరణిలోనే.. వైజ్ఞానికంగా చెప్పాలి.

సెక్స్ అంటే 'బూతు' కాదు. సెక్స్ అంటే- ప్రేమ, ఆప్యాయత, సాన్నిహిత్యం, పునరుత్పత్తి, పెంపకం, అంతిమంగా కుటుంబ వ్యవహారమన్న వైఖరి ముఖ్యం. సెక్స్ పట్ల ప్రజల్లో లేనిపోని ఆసక్తి రేకెత్తించటం కాకుండా.. సెక్స్‌ను ఒక ఆహ్లాదకరమైన, బాధ్యతాయుతమైన కుటుంబ వ్యవహారంగా చూడటం, చూపించటం.. చాలా అవసరం!

నిషిద్ధపదం కాదు




సెక్స్ పట్ల చక్కటి అవగాహన కోసం పిల్లల నుంచి వృద్ధుల వరకూ అంతా హాయిగా చదువుకునేందుకు వీలుగా ఇటీవలే **'సెక్స్ ఈజ్ నాట్ ఎ ఫోర్ లెటర్ వర్డ్'** పుస్తకం రాశారు డా॥ సుధాకర్ కృష్ణమూర్తి. లైంగిక విజ్ఞానాన్ని అసభ్యతకు తావులేని సరదా శైలిలో రంగరించి చెప్పటం ఈ రచన ప్రత్యేకత.